పనులు యుద్ధప్రాతిపాదికన చేపట్టాలి

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోశ్

అమ్మఆదర్శ పాఠశాలల్లో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోశ్

గద్వాల, జూన్ 1: అమ్మ-ఆదర్శ పాఠశాలల్లో ప్రతిపాదనలకు అనుగుణంగా పనులు నాణ్యతతో యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గంజిపేట ప్రభుత్వ ప్రాథమిక, మోమిన్‌మహేలా పాఠశాలలో చేపడుతున్న పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. మోమిన్ మహేలా పాఠశాలలో ఇదివరకే టాయిలెట్స్ ఉండగా కొత్తగా ఎందుకు నిర్మిస్తున్నారని సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. మరమ్మతులకు ప్రతిపాదనలు చేయకపోవడానికి కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో సరైనా సమాధానం రాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమున్నచోట పనులు చేపట్టకుండా చేసిన పనులు ఎందుకు చేస్తున్నారని, ప్రాధాన్యతా క్రమంలో గుర్తించకుండా కార్యాలయాల్లో కూర్చొని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారాఅని ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరమైన ప్రతిపాదనలు చేసిన సంబంధిత అధికారికి మెమోజారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్‌వెంట ఈ ఈ విజయ్‌కుమార్, డీఈ సందీప్ ఉన్నారు.

సకాలంలో దుస్తులు అందేలా చూడాలి

పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రం భీంనగర్‌లో ఉన్న ఏకరూప దుస్తుల కటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. దుస్తులను కట్ చేసేందుకు యంత్రాలను వినియోగిస్తుండడంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో నర్సింగరావు, ఏపీడీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దవాఖాన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దవాఖాన కార్మిక నేతలు

వనపర్తి, మే 1: జిల్లా కేంద్రంలోని దవాఖాన, ఎంసీఎహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల వేతనాలు చెల్లించక పోవడం చాలా ఇబ్బందికరమైన విషయమని కార్మిక నాయకుడు అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని అంబియన్స్ ఏజెన్సీ అక్రమాల పై జరుగుతున్న విచారణ పేరిట మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించుకపోవడం విడ్డూరమన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడంలో ఏజెన్సీ పూర్తిగా విఫలమైందన్నారు. దీనిపై గతంలో అనేక పర్యాయాలు ఏజెన్సీ నిర్వాహకులు, దవాఖాన సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లితే అంబియన్స్ ఏజెన్సీ అక్రమాలపై విచారణ జరుగుతున్నదని కొంతకాలం ఓపిక పట్టాలని, అడిగిన ప్రతిసారి ఇదే అంశాన్ని తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారుకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేశ్, నాయకులు చంద్రయ్య, వరుణ్ పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

గోపాల్‌పేట, జూన్ 1: మూఢనమ్మకాలు వీడి సైన్స్‌పై అవగాహన కలిగించేందుకే జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. 15 రోజులుగా మండలంలోని బుద్దారం విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం గ్రంథాలయ భవనంలో వనపర్తి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు (సమ్మర్) సైన్స్ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరై మాట్లాడుతూ.. సైన్స్‌ఇంతగా అభివృద్ధి చెందుతున్నా ఇంకా అక్కడక్కడ మూఢనమ్మకాలు చూస్తూనే ఉన్నామన్నారు. మూఢనమ్మకాలు దూరం కావాలంటే సైన్స్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. సైన్స్ తరగతులు నిర్వహించిన వారిని శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో జెవీకే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేందర్, నాగేంద్రం, ఉపాధ్యక్షుడు ఓంకార్, పూల్యానాయక్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

పెబ్బేరు, జూన్ 1: యూత్ ఫర్ యాక్షన్-మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం చేపట్టింది. గార్డెన్ కీపింగ్‌పై 25 రోజుల పాటు ఉచితంగా అగ్రికల్చర్ స్కిల్ ట్రైనింగు ఇవ్వనున్నట్లు కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త సురేశ్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. జూన్ రెండో వారంలో ఆరంభమయ్యే ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌తోపాటు, హైదరాబాద్‌లో ఉపాధి చూపించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, కనీసం 6వ తరగతి ఆపైన చదివి ఆసక్తి ఉన్నవారు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణలో వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు చెందిన 25మందికి అవకాశం ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్

కేటీడొడ్డి :నందిన్నె మనగ్రోమోర్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో గోవిందు నాయక్

కేటీడొడ్డి, జూన్ 1: ఎమ్మార్పీ ధరలకే రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవిందు నాయక్ అన్నారు. శనివారం మండలంలోని నందిన్నెలోని మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని, కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేసి ఉంచాలన్నారు. కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి మహాలక్ష్మి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఖిల్లాఘణపురం, జూన్ 1: విత్తన దుకాణాల్లో ప్రభుత్వ గుర్తింపు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న 15 విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ముందుగా దుకాణాల్లోని రికార్డులు, నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వానకాలం సాగుచేసే పంటలపై రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే ఫర్టిలైజర్, విత్తన డీలర్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ప్రతి మండలానికి టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వానకాలం పంటలకు అవసరమయ్యే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేసేలా విత్తన డీలర్ దుకాణా యజమానులు చూడాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు. మండలంలోని మనగ్రోమోర్ సెంటర్, ఎస్‌వీ నర్సింహులు, పవన్ ట్రేడర్స్, లక్ష్మీచెన్నకేశవ ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది డీటీ పరమేశ్వర్, ఎస్సై శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ మునిస్వామి, ఉన్నారు.

గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, జూన్ 1: ఏదుల మండల కేంద్రంలోని విత్తన డీలర్ల దుకాణాలను శనివారం మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రమించాలని, కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించకూడదన్నారు. విత్తనాలు తీసుకున్న రైతులకు రసీదు ఇవ్వాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయించరాదన్నారు. ఏవోవెంట ఏఎస్సై రాములు, ఆర్ఐ యాదయ్య ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కొత్తకోట, జూన్ 1: పట్టణంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఏవో షేక్‌మున్నా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని, వర్షాకాలంలో పత్తి, సాగుకు సరిపడా నాణ్యమైన విత్తనాలు ఉండాలన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండలానికి కావాల్సిన సరిపడా విత్తనాలు, ఎరువులు ఉన్నాయన్నారు. అనంతరం రికార్డులు, స్టార్ రిజిస్టర్లను పరిశీలించారు.

ఖిల్లాలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఏదులలో తనిఖీ చేస్తున్న ఏవో అనిల్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

విత్తన వివరాలను వెల్లడించాలి

వనపర్తి, జూన్ 1: జిల్లాలో వానకాలం సీజన్‌కు అందుబాటులో ఉన్న విత్తన వివరాలను రైతులకు వెల్లడించాలని వ్యవసాయశాఖాధికారులను వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి చంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పత్తివిత్తనాల కోసం రైతులు ఇబ్బందుల పడుతున్న దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు అంతంత మాత్రమే ఉందన్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, పత్తి, కంది తదితర పంటలను రైతులు జిల్లాలో సాగు చేస్తున్నారని, రోహిణీ కార్తెరావడంతో బోర్లకింద వరినార్లు పోసుకొనేందుకు రైతులు సిద్ధమవుతున్నారని, అందుకు తగ్గట్టు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు రైతులకు భరోసాను కల్పించే పరిస్థితి లేదన్నారు. విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే రైతుతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చారించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రమేశ్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

హద్దులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్, జూన్ 1: మండలంలోని చిక్కేపల్లిలో ప్రభుత్వం కేటాయించిన బీసీప్లాట్ల హద్దురాళ్లను జేసీబీ సహాయంతో ప్లాట్ల హద్దురాళ్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మాజీ సర్పంచ్ బాలస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు తాసీల్దార్ శుభాశ్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. చిక్కేపల్లిలో సర్వేనెంబర్ 361లో 2.30 ఎకరాల్లో 65మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. శనివారం తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో గ్రామానికి చెందిన ఓవ్యక్తి జేసీబీ సహాయంతో హద్దురాళ్లు తొలగించి చదును చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్ల హద్దురాళ్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్ణీతకాలంలో దుస్తులు సిద్ధం చేయాలి

ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీవో

అలంపూర్, జూన్ 1: నిర్ణీత గడువులోగా విద్యార్థుల దుస్తులు కుట్టడం పూర్తి చేసి పాఠశాలలకు అందించాలని డీఆర్డీవో పీడీ నర్సింగరావు అన్నారు. శనివారం అలంపూర్ మండలంలో ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుడుతున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. వారి వెంట ఏపీఎం ప్రవీణ, ఈజీఎస్ ఏపీవో రాజు, సీసీలు, వీవోఏలు ఉన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వంసిద్ధం

గట్టులో రంగుల కాగితాలు కడుతున్న మండల పరిషత్ సిబ్బంది

అయిజ, జూన్ 1: అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సర్వంసిద్ధం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం అధికారులు కార్యాలయాలను మామిడి తోరణాలు, కొబ్బరి ఆకులు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. అయిజ పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఐ కేపీ కార్యాలయం, పీఏసీసీఎస్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయం, ఎంఆర్‌సీ భవనంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు తెలంగాణ ఆవిర్భావ సంబురాల సందర్భంగా ఆదివారం జాతీయజెండాను ఆవిష్కరించనున్నారు. ఆయా కార్యాలయాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ప్రజాప్రతినిధులు, అధికారులు ఎగుర వేయనున్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

గట్టు, జూన్ 1: రాష్ట్ర అవతరణ దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. దశాబ్ది ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, ప్రజలు హాజరుకావాలని అధికారులు కోరారు.

ఉత్సాహంగా ముగింపు ఉత్సవాలు

ముగింపు ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న చిన్నారి

గద్వాలటౌన్, జూన్ 1 : శాస్త్రీయ సంగీతాన్ని కళ్లకట్టినట్లు చిన్నారులు చేసిన కళా ప్రదర్శన.. పల్లే ప్రాముఖ్యత.. పల్లెపదాలను చాటుతూ సాగిన జానపద నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆలపించిన అన్నమమ్య కీర్తనలు స్రోతలను కట్టిపడేశాయి. విద్యార్థుల కళా ప్రదర్శన తన్మయత్వంలో ముంచేశాయి. గద్వాల బాలభవన్‌లో ఆధ్వర్యంలో ఇస్తున్న వేసవిశిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు ఉత్సవాలు అదిరిపోయాయి.

చిన్నారులకు తల్లితండ్రులు తోడ్పాటు ముఖ్యం

చిన్నారుల రాణింపునకు వారి తల్లిదండ్రుల తోడ్పాటు కూడా చాలా అవసరమని డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్ అన్నారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఏకాగ్రత, పట్టుదల, అంకితభావం, పక్కా ప్రణాళిక ఉంటే తామెంచుకున్న ఏ లక్ష్యాన్నైనా సులువుగా చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ శంకర్, గాయకుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి జయంతి

- బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

బీచుపల్లి క్షేత్రంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

ఇటిక్యాల, జూన్ 1: నడిగడ్డ ఇలవేల్పు అంజన్న వెలిసిన బీచుపల్లి క్షేత్రంలో శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి నెలరోజుల పాటు భక్తులు దాసంగాలు (కొత్తకుండలో కుడుములతో చేసిన నైవేద్యం) సమర్పించడం ఆనవాయితి. అయితే ఈనెల రోజుల్లో శని, సోమవారాలు భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. అమావాస్య ముందు శనివారం కావడంతో వేలాదిగా భక్తులు మొక్కులు సమర్పించడానికి క్షేత్రానికి వచ్చారు. భక్తులు రాకతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.

అయిజలో..

అయిజ, జూన్ 1: ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలో అంజన్నకు అభిషేకం, ఆకుపూజ, పల్లకీసేవ నిర్వహించారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, జూన్ 1: శాంతినగర్‌లో శనివారం హనుమాన్ ఆలయాల్లో అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. అలాగే జూలేకల్ శివారులో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో పూజారి సాయి పూజలు చేశారు.

ఆలయాల్లో పూజలు

ఖిల్లాఘణపురం, జూన్ 1: మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు స్వామివారికి పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దమందడిలో..

పెద్దమందడి, జూన్ 1: మండలంలోని దొడగుంటపల్లిలో స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు. గ్రామంలోని ఆలయంలో స్వామివారికి నిర్వాహకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కొత్తకోటలో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పెబ్బేరులో

పెబ్బేరు, జూన్ 1: పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానికమిట్ట, వీరంపేట ఆలయాలతోపాటు సూగూరు, కిష్టారెడ్డిపేట, పాతపల్లి, శ్రీరంగాపురంలోని ప్రత్యేక పూజలు చేశారు.

అయిజ మండలంలో..

అయిజ రూరల్, జూన్ 1: మండలంలోని కిష్టాపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆకుపూజ, హోమం, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆత్మకూర్‌లో

ఆత్మకూరు, జూన్ 1: అంజనీపుత్రుడు ఆంజనేయస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు చేశారు. మల్లాపురంలో భక్తజనంతో భజన కీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. చైర్‌పర్సన్ గాయిత్రీ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తకోటలో..

కొత్తకోట, జూన్ 1: మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని కోట్ల ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుల పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. కానాయపల్లి స్టేజీ సమీపంలోని దత్తకోటిలింగేశ్వర ఆలయం, కనిమెట్ట బాలాబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఆశ'లకు పరీక్షలను రద్దుచేయాలి

కొత్తకోట, జూన్ 1: ఆశ కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్ష పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆ సంఘం మండలాధ్యక్షురాలు మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లు నిరసన తెలిపి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశలకు ఇస్తున్న పారితోషకాన్ని రూ.18వేలు పెంచి ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుష్ప, రేణుక, చంద్రకళ, మంజుల, వరలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతికి సంతాపం

అలంపూర్, జూన్ 1: మండలంలోని లింగనవాయికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ చెన్నకేశవులు(52) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సీ రితిరాజ్ ఆదేశాల మేరకు కోదండాపురం ఎస్సై స్వాతి అంత్యక్రియలకు హాజరూరై నివాళులర్పించారు. చెన్నకేశవులు అంత్యక్రియలకు శాఖాపరంగా రూ.20వేల నగదును సతీమణి చెన్నమ్మకు అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

ఖిల్లాఘణపురం, జూన్ 1: నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు శ్రీజ కంప్యూటర్ సెంటర్‌లో పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్ కోర్సులను 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తవ్వడంతో శనివారం పాఠశాలలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మల్లేశ్, పరీక్ష ఇన్‌చార్జి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్టిఫికేట్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకుడు అర్జున్, ఉపాధ్యాయులు తాజుద్దీన్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలి మృతికి సంతాపం

మల్దకల్, జూన్ 1: మండలంలోని పావనంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అరుణమ్మ(50) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా పలు విద్యా సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎంఈవో సురేశ్, పలువురు ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సానూభూతిని వ్యక్తపరిచారు. ఆమెకు భర్తతోపాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఆదిశిలాక్షేత్రంలో భక్తుల కిటకిట

మల్దకల్, జూన్ 1: ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, రమేశ్‌చారి, ధీరేంద్రదాస్, వాల్మీకి పూజారులు ఉదయం బిందెసేవా, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కృష్ణస్వామి ఆలయం, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నాగర్‌దొడ్డికి చెందిన శంకరన్న అన్నదానం చేశారు.

సారా తయారీదారులపై కఠిన చర్యలు

పాన్‌గల్, జూన్1: సారా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ శుభాశ్‌నాయుడు అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా, కిష్టాపూర్ తండాకు చెందిన 15మంది సారా తయారీ, అమ్మకందార్లను శనివారం ఎక్సైజ్ ఎస్సై సంధ్యారాణి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అనంతరం రూ.లక్షా పూచీకత్తుపై వారిని తాసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ అశోక్‌నాయుడు, ఆర్ఐలు తిరుపతయ్యసాగర్, మహేశ్‌నాయుడు, ఎక్సైజ్ సిబ్బంది రాజు, కురుమూర్తి పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ఆలయ భూములు

వడ్డేపల్లి, జూన్1: మండలంలోని కొంకల, జూలేకల్‌కు చెందిన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని బీజేపీ నాయకులు మధుసూదన్‌గౌడు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కొంకల, జూలేకల్‌కు చెందిన ఈశ్వరస్వామి, లింగమన్న స్వామి, ఆంజనేయుస్వామి ఆలయ భూములను దేవుని పేర్ల నుంచి సొంతపేర్ల మీదకు పట్టా చేయించుకున్నారని ఆరోపించాడు. సంబంధిత అధికారులు విచారణ జరిపి మాన్యంభూములు ఆలయాలకే చెందేలా చూడాలని కోరారు.

యువత క్రీడలో రాణించాలి

పెద్దమందడి, జూన్ 1: యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మద్దిగట్లలో శ్రీనివాస్‌రెడ్డి తల్లిదండ్రులు వెంకటమ్మ, సాయిరెడ్డి స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశారు. ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో ఖిల్లాఘణపురం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాయిచరణ్‌రెడ్డి, ఎస్సై శివకుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

పెబ్బేరు, జూన్ 1: పెబ్బేరుకు సమీపంలో 44వ నెంబరు జాతీయరహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్సై శ్రీనివాసగౌడ్ కథనం మేరకు కర్నూలు బైపాస్‌కు సమీపంలో సందర్శిని హోటల్ వద్ద కర్నూ